క్లుప్తంగా

ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



డిగ్రీ కాలేజి విద్యార్థులకు ఆంగ్ల నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు రత్నకుమార్

గణపవరం: ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని, అప్పుడే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలుగుతారని రాజమహేంద్రవరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి ఆంగ్ల విభాగాధిపతి కె.రత్నకుమార్ అన్నారు. శనివారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో ఆయన విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. మాతృభాషతో పాటు ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంచుకోవాలని, ప్రతి రోజు ఆంగ్ల పత్రికలు చదవడం ద్వారా భాషా నైపుణ్యం పెంచుకోవచ్చునన్నారు. ప్రిన్సిపల్ నిర్మలకుమారి, ఆంగ్ల విభాగం అధ్యాపకుడు టి.అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి



పిప్పరలో ప్రదర్శన చేస్తున్న మలేరియా అధికారి, వైద్య సిబ్బంది

గణపవరం: దోమల వ్యాప్తి చెందితే వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయని, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం యూనిట్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడు, కోమట్లపాలెం, పిప్పరలో కీటక జనిత వ్యాధులు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి దోమల వృద్ధి- నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో ఆర్మీ పోలీసుల కవాతు



గణపవరం వీధుల్లో కవాతు చేస్తున్న సీఐ సుభాష్ పోలీసు, ఆర్మీ సిబ్బంది

గణపవరం: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన గణపవరం ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్మీ సిబ్బందితో కలిసి గణపవరం మండలం కేశవరం, మల్లపరాజుపేట, జల్లికాకినాడ, మొయ్యేరు, ముప్పర్తిపాడు గ్రామాల్లో ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్ మాట్లాడుతూ గణపవరం మండలంలో ఐదు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని గణపవరం, సరిపల్లె, అర్ధవరం, పిప్పర, మొయ్యేరులో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: గోపన్నపాలెంలో ఇటీవల మృతి చెందిన ఏనుగు ముసలయ్య కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీతంపేట గ్రామానికి చెందిన మోదుగు పోతురాజును పరామర్శించి అతని ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం సోమవరప్పాడులో అన్నం మద్దిరామయ్యను పరామర్శించారు.

మహిళలే కీలకం

- దెందులూరు నియోజకవర్గంలో అధికంగా మహిళా ఓటర్లు
- తాజా జాబితాలో పురుషుల కంటే మహిళలు 5,840 మంది అధికం



దెందులూరు: చారిత్రక నేపథ్యం కలిగిన దెందులూరు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు.భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన 2023-24 సంవత్సరం ఓటర్ల జాబితాలో దెందులూరు నియోజకవర్గంలో మహిళలు పురుషుల కంటే 5,840 మంది అధికంగా ఉన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్, దెందులూరు మండలాలు ఉన్నాయి. రెండు నెలల్లో నిర్వహించనున్న ఎన్నికల్లో దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించేది మహిళా ఓటర్లే. మహిళలు చైతన్యవంతమై, విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుంది. గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉండే దెందులూరు నియోజకవర్గం రాజకీయంగా, సామాజికంగా ఆది నుంచి ఎంతో చైతన్యవంతమైన నియోజకవర్గం. గ్రామాలు అభివృద్ధి చెందుతుందన్న సత్యానికి వాస్తవ రూపంగా నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదు కావడం మహిళా చైతన్యానికి నిదర్శనం.

ఎన్నికల కోడ్ పాటించాలి



ప్రతి ఉద్యోగి భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులకు, సిబ్బందికి సహకరించాలి. ఉద్యోగులు, రాజకీయ పార్టీలు హద్దు మీరితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవు. ఎన్నికల కోడ్‌ను అధికారులు తూ.చ తప్పకుండా అమలు చేయాలి.

– బి.లావణ్యవేణి, రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్

దెందులూరు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

పురుషులు	1,08,465
మహిళలు	1,14,305
ట్రాన్స్ జెండర్స్	07
సర్వీసు ఓటర్లు	102
పీడబ్ల్యూజీ ఓటర్లు	2,638
నూతన ఓటర్లు	5,438
మహిళల ఆధిక్యం	5,840
పోలింగ్ బూత్‌లు	239
రూట్లు	23
ఎస్ఎస్ బృందం	4
వీడియో బృందం	4
వీడియో వివీల్ బృందం	1
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	4
అకౌంటింగ్ బృందం	1
అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ బృందం	1
ఎంసీసీ బృందం	4
ఆర్వో	1
ఏఆర్వోలు	4

ఎన్నికల నిబంధనలు పాటించాలి



రాయన్నపాలెం ప్రధాన కూడలిలో ప్రజలతో సమావేశమైన పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్

పెదవేగి : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని రాయన్నపాలెం, కొండలరావుపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నియమ నిబంధనలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను అనుసరించి మండల వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని దీనిని అనుసరించి నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది రోడ్లపై ఒకే చోట ఉండడం నిషిద్ధమని, అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీలపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- పోతునూరులో పోస్టర్ల విడుదల



పోతునూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నాయకులు

దెందులూరు: ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం, అభివృద్ధి, సంక్షేమం కోసం ఐదేళ్లు శ్రమించి దేశంలో అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేసిన ప్రజానేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరోసారి బలపరచాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరారు. శనివారం పోతునూరులో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, సర్పంచ్ బోదుల స్వరూప్ ఆధ్వర్యంలో నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపురంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ నవరత్న పథకాలతో పాటు హామీలివ్వని అనేక పథకాలను జగనన్న అమలు చేశారని తెలిపారు. పెద్ద ఎత్తున అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన మంచి మనస్సున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన, దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధికి వారికి మరింత సంక్షేమ ఫలాలు అందాలని పరితపిస్తూ బడ్జెట్‌లో కోట్లాది రూపాయలు కేటాయించి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం సైతం ఈ రెండు వ్యవస్థలు అమలు చేసే దిశగా ఆలోచన రేకెత్తించారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి ఎంతో మేలు చేశారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీకి చెందిన అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమన్నారు. సర్పంచ్ బోదుల స్వరూప్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పోతునూరులో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన సాకారమైందన్నారు. పోతునూరు గ్రామానికి విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజులకు, సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు సున్నా ఆశీర్వాదం, ఎంపీటీసీ సున్నా నరేష్, నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పోతునూరు లైబ్రరీ రోడ్డు, సర్పంచ్ వీధి, దళిత వీధి, లక్ష్మీపురంలో నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ మాజీ చైర్మన్ డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జీ), పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సున్నా ఫణీ, బత్రాజు సత్యనారాయణ, బుద్దా అర్జున, రమేష్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఒకటి నుంచి ఏసుక్రీస్తు సువార్త మహాసభలు



దెందులూరు మన్నా చర్చిలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఫాస్టర్ బెంజిమన్, సంఘస్తులు

దెందులూరు: దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో వచ్చే నెల 1,2,3 తేదీల్లో ఏసుక్రీస్తు సువార్త మహాసభలు నిర్వహించనున్నట్టు పాస్టర్ కే.బెంజిమన్ అన్నారు. శనివారం మన్నా చర్చిలో సంఘస్తులతో కలిసి మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. మూడు రోజులు పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు 2,3 తేదీల్లో ఉదయం 11 గంటలకు మన్నా చర్చిలో సభలు జరుగుతాయని సువార్తీకులు చార్లెస్ పీ.జాకబ్, బ్రదర్ కిరణ్‌పాల్, జాన్ మంగాచారి, స్టీవెన్‌సన్, వి.రాకేష్ విచ్చేస్తారన్నారు. దెందులూరు సమీప గ్రామాల్లోని భక్తులు మహాసభల్లో పాల్గొనాలని కోరారు.

వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు బాధాకరం

దెందులూరు: నామమాత్రపు వేతనంతో సమయాలకు అతీతంగా, ప్రాణాలను పణ్ణంగా పెట్టి సేవలందిస్తున్న వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం బాధాకరమని ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పళ్ళెం ప్రసాద్ అన్నారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా వలంటీర్లు పని చేస్తున్నారని ఆయన అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన వలంటీర్లను ఎన్నికలు అయ్యేవరకు విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించడంపై పళ్ళెం ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల విధి నిర్వహణ, సేవలపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని అన్నారు. వలంటీర్లను విధులకు దూరం చేయడం వల్ల పెన్షన్, సంక్షేమ పథకాల అమలులో జాప్యం, లబ్ధిదారులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ మరోసారి వలంటీర్లపై ఉన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

సంక్షేమాభివృద్ధి పాలన వైఎస్సార్ సీపీకే సాధ్యం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఉంగుటూరు: సంక్షేమాభివృద్ధి పాలన వైఎస్సార్ సీపీకే సాధ్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం మండలంలోని సీతారామపురంలో వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌తో కలిసి వాసుబాబు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే నాయకుడు జగన్ అని అన్నారు. ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని, కుట్రలకు పాల్పడుతున్నాయన్నారు. చంద్రబాబుకు తోడుగా ప్రజా సమస్యలపై అవగాహన లేని పవన్ కల్యాణ్ టీడీపీని అధికారంలోకి తేవడానికి ఉవ్విళ్లూరుతున్నారని అన్నారు. ప్రజా ఆశీర్వాదం జగనన్నకే ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, నాయకులు నౌడు వెంకటరమణ, ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకుడు మామిడిపల్లి జయప్రకాష్, మండలాధ్యక్షుడు మరడా మంగారావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎస్సీ మాజీ చైర్మన్ మరడ రమావతి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, నల్ల కుసుమ హరిబాబు, నల్ల రాంబాబు, నడిమాంటి సతీష్, నల్ల శివ, నల్ల సుబ్బారావు, నల్ల సీతారాముడు, నల్ల దుర్గప్రసాద్, నడిమాంటి దుర్గప్రసాద్, రొంగల రామకృష్ణ, మానుకొండ డేవిడ్, జుట్టుగ షెట్రాక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మారుమూల గ్రామాలకు మానవత సేవలు



ఆర్థిక సహాయం అందిస్తున్న మానవత ప్రతినిధులు

గణపవరం: మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారానికి, ఆపన్నులకు సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయకం అన్నారు. శనివారం గణపవరం మనవత కార్యాలయం వద్ద నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో గతేడాది మానవత సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, ఆర్థిక వివరాలను ఆయన సభ్యులకు వివరించారు. గణపవరం శ్మశాన వాటికలో ఫ్రీజర్లు ఏర్పాటు చేయడానికి, ఫ్రీజర్లు లేని గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అర్ధవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీరందించే మినరల్ వాటర్‌ప్లాంటు మరమ్మతులకు మానవత సంస్థ నిధుల నుంచి రూ.18వేల నగదును అందజేశారు. ఈకార్యక్రమంలో మానవత మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి కృష్ణంరాజు, మానేపల్లి చిరంజీవి, ఉపాధ్యక్షుడు వంకాలయ రామారావు, సభ్యులు సాగిరాజు సుబ్బరాజు, బొడ్డు శ్రీను, దండు బంగార్రాజు, పెరుమాళ్ల ఆంజనేయులు, గంజి నాగన్న పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైతన్య భారతి ప్రిన్సిపాల్ మురళి

పెదపాడు: అప్పనవీడు సెంటర్‌లోని చైతన్యభారతి పాఠశాలలో ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్ మురళి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మచిలీపట్నం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ మెకానికల్ ఇంజనీర్ వి ఎలీషా, రిటైర్డ్ పొలిటికల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు కరుణాకర్ పలు అంశాలను విద్యార్థులకు వివరించారు.

వైభవంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : కొప్పాకలో ఎర్రచెరువు గట్టు మీద శ్రీ హనుమత్, సీతా, లక్ష్మణ సమేత కోదండ రామస్వామి వార్ల ఆలయ విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు అనంతరం ప్రతిష్ఠ మహోత్సవాన్ని కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు, రత్నకుమారి దంపతులు ఆలయానికి ధ్వజ స్తంభాన్ని బహూకరించారు. తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

భీమడోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శక్తివంతమైన ప్రజాస్వామ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ శనివారం పోలసానిపల్లిలో కళాజాత బృందం కారులు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. ఏలూరు కీర్తన కల్చరల్ సొసైటీ బృందం నాయకులు యడవల్లి కృష్ణప్రసాద్, చిరంజీవి స్వీప్‌పై బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పోలింగ్ శాతం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోఆర్డీ ఏ.సుందరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.